# ఎడబాటు

[కథానిక]

= శ్రీ శివకోటి సత్యనారాయణ =

పాపం, యింకా రంగస్థలవాతావరణానికి బాగా అలవాటుపడలేదు కాబోల్ను, డ్రైవరువీరన్న, బెదురుతూనే ఉన్నాడు. ఈ బర్మారంగానికి వచ్చిన దగ్గరనుంచీ నిద్రకే కరువైపోయింది పాపం!

కాని—ఈ రెండురోజుల్నుంచీ హాస్పిటల్ డ్యూటీ తగలడంవల్ల మునుపటికన్న ఎక్కువవిశ్రాంతి తీసుకోడానికి టైము దొరుకుతూంది. అలాగే కళ్లుమూసుకొని గడిపేస్తున్నాడు కాలాన్ని.

వచ్చిన రెండోరోజున—వీరన్నకూ, అతనితోడి డ్రైవరుకూ ఏదో సంఘర్షణ జరిగినట్టుంది— ట్రక్కును వార్డుబయట నిలిపేసి, లోనికి పోయి ఏదో గొణుక్కుంటున్నాడు తెలుగులో. ఇతరులకి తెలియని భాషలో తిట్టుకోడం అతని కదొక ఉపశాంతి!

దగ్గరలోనే, ప్రక్కగానున్న గదిలోంచి వినిపించింది "ఎందుకోయ్, అలా తిట్టుకుంటావ్" అని స్పష్టమైన తెనుగులో.

గిరుక్కున తిరిగాడు రిచ్చపోతూ! ఆ హాస్పిటలుకు వచ్చిన తరువాత యితరుల నోటినుంచి తెలుగు వినడం అదే మొదటిసారి.

ఆమెనుకూడ ఆ హాస్పిటల్‌లో రెండుమూడుసార్లు చూచాడుకాని ఆమెకు తెలుగు తెలుసు ననుకోలేదు.

"ఎవర్ని, అలా తిడుతున్నావ్?" మళ్లీ అడిగిందామె—కుర్చీలో కూచుని రాసుకొంటూ.

"అబ్బే, లేదండి. ఆ రెండో డ్రైవరున్నాడు పెంకిఘటం. తనకు తెలీదు; ఇతరులు చెప్తే వినడు. వాణ్ణి లక్షసార్లు హెచ్చరించాను 'ట్రక్కును వదిలి వెళ్లకురా' అని. ఒకవేళ ఎక్కడకన్నా వెళ్లాల్సొంటే, ట్రక్కును నాకు వప్పగించి, చెప్పి, వెళ్లమన్నాను. అసలే గడ్డురోజులాయె! ఏనిమిషానికి ఎటువచ్చి ఎటుపోతుందో తెలియదు. అలాంటప్పుడు వీడు ఖాతరు లేకుండా ట్రక్కును ఓమూల వదిలేసి యిష్టంవచ్చినట్టు పచార్లుకొడతాడా!"

"ఎవడూ వాడు, ఆ రెండో డ్రయివరు?"

"వాడూ...పంజాబీవాడు."

"సరే, వాడి తిక్క కుదిరిపిస్తానుగాని, మీ...ది...మీదేవూరారూ?" అంది తీక్షణంగా చూస్తూ.

"మాది నర్సాపురం తాలూకాలో ఒక గ్రామమండి."

"అంటే గోదావరిజిల్లాగదూ?"

"ఔనండి."

ఆమె దేవూరో తెలుసుకోవాలని వీరన్నకుకూడ కుతూహలంగానే ఉంది. కాని ఏమన్నా అనుకుంటుందేమోనన్న భయం.

ఇంతచనువుగా మాట్లాడుతున్నప్పుడు ఈ మాత్రానికే ఏమన్నా అనుకుంటుందా అన్న సంకల్పానికి వచ్చి అడిగేశాడు.

"తమ దేవూరమ్మగారూ?"

"మాది విశాఖపట్నం. సరేగాని, నీపేరేమి టోయ్ ?" అని అడిగింది. వ్రాసినకాగితాన్ని మడుస్తూ.

"వీరన్నండి."

నిజంగా వీరన్నకు ఆమెతో మాట్లాడాలని ఎంతో కుతూహలంగా ఉంది. ఆ హాస్పిటల్‌లో అసలు తెలుగువాళ్లే లేరనుకున్న వీరన్న ఆమె 'తన తెలుగు గడ్డ' నుంచే వచ్చిందంటే ఆశ్చర్యపోడూ!

ఇంతలోనే బయటనుంచి ఎవరో వీరన్నను పిలిచిన కేక.

"వాడు పిలుస్తున్నాడండి. మళ్లీ యిప్పుడే వస్తాను" అంటూ బయటకుపోయాడు వీరన్న.

రెండునిమిషాలు పోయాక మళ్లీ వచ్చి, "సప్లయికి పోవాలి. మళ్లీ రేపొస్తాను లెండి" అంటూ, ఆమె చెప్పబోతున్న దేమిటోకూడ వినిపించుకోకుండా వెళ్లి పొయ్యాడు, ఆదరాబాదరగా. ట్రక్కువైపుకి.

సప్లయిలుతీసుకొని, ఆరోజు కొంచెం ప్రొద్దు పోయినతరువాత వచ్చాడు వీరన్న. అప్పటికప్పుడే క్యాంపుఅంతా మాటుమణుగుతూండడంవల్ల మళ్లీ ఆ వార్డులోకి వెళ్ల వీలుపడిందిగాదు. ట్రక్కును చెట్టు చాటున నిలిపి, ఆ సీటులోనే కూచుని, స్టీరింగుచక్రం మీద బుఱ్ఱని ఆన్చుకుంటూ కునుకుతీశాడు తెల్లారే వరకూను.

యుద్ధరంగంలోని ఏసైనికునికైనా యింతకన్నా ఎక్కువ విశ్రాంతి దొరకడం దుర్లభం.

* * * * *

మర్నాడు—పదకొండు కావస్తోంది.

వీరన్న, తాను ఉదయాన్నే చేయవలసిన డ్యూటీని పూర్తిచేసుకుని, ఆ వార్డులోకి వచ్చాడు. ఆమె అక్కడే కూచునుంది, ఏదో ఉత్తరం రాసుకొంటూ.

"ఏం వీరన్నా, చెప్తూన్న మాటన్నా విని పించుకోకుండా వెళ్లిపోయావు నిన్నసాయంత్రం ?" అంది పైకిచూస్తూ.

"అబ్బే లేదండి, బాగా చీకటిపడిపోతే సెంట్రీలూ, గార్డులూ ప్రతిచోటా ఆపి చెక్ చేస్తారు గదాండి! లేనిపోని తిప్పలన్నీ ఎందుకూ, బాగా వెలుగుండగానే వెళ్లొచ్చేస్తే మంచిదని కాస్త విసురుగానే పోయానులెండి" అన్నాడు క్షమాపణార్థంగా.

ఒకక్షణం నిశ్శబ్దంగా గడిచిపోయాక—

"సరేకాని వీరన్నా, మిలిటరీలో చేరకముందు ఏం చేస్తూండేవాడివి ?" అంది, రాత ఆపి.

"ఏదో కామందుల భూముండేది. సాగుబడి చేసుకుంటూండేవాణ్ణండి."

"అయితే, చక్కగా యింటిదగ్గర కాలం గడిచి పోతూన్నప్పుడు మిలిటరీలో ఎందుకు చేరేవు ?"

"అదంతా......" కొంచెం తడబడ్డాడు. ఆ తడబాటును గ్రహించకపోలేదామె, ఓరచూపుతో.

మళ్లీ "ఏదోలెండి, అయిపోయింది. నాకీమిలిటరీలోనే స్వేచ్ఛగాఉంది. గడిగడిక్కీ గండమైనా యిక్కడే సుఖంగా ఉంది." అన్నాడేకాని, అతని మాటల్లో ఏదో వ్యథ స్పష్టంగా గోచరిస్తోంది. గోడనున్న స్టెతస్కోపుపై నిగిడించిన అతని దృష్టిలో పూర్వజీవితం అంతా సినీమా బొమ్మల్లాగ తిరిగి పోయింది!

"అయితే, వీరన్నా..." అని ఆమె వీరన్నను జాగృతినుంచి లేపేవరకూ అత నీలోకంలోనే లేడు.

"ఆఁ, ఏమండీ ?" అన్నాడు ఒక్క దీర్ఘ నిశ్వాసం విడిచి, బుఱ్ఱ గోక్కుంటూ.

"పాపం, పెళ్లాంపిల్లలు జ్ఞాపకం వస్తున్నట్టున్నారు" అన్నదామె సానుభూతి చూపిస్తున్నట్టు.

"అబ్బే, లేదండి"—ఇంకా ఏదో చెప్పబోదామనుకున్నాడుగాని నోరు పెగల్లేదు.

"ఏదో దాస్తున్నావ్. మనస్సులోని సుఖ దుఃఖాల్ని తోటివాళ్లతో చెప్పుకుని వెళ్లగ్రక్కుకుంటే గాని మనశ్శాంతి ఉండదు చూడు. అవునా ?"

ఆమె అంత కలుపుగోరుతనంగా మాట్లాడుతూండడం చూసి ఆశ్చర్యపోయాడు వీరన్న.

ఆమె—ఆఫీసర్ల హోదాలోని నర్సింగ్ సిస్టరు.

వీరన్న—మామూలు సిపాయిమాదిరిగా పరిగణింపబడే ఒక డ్రయివరు.

ఇద్దరకూ నక్కకూ, నాకలోకానికీ ఉన్నంత తేడా ఉంది. అలాంటప్పుడు ఆమె అంతచనువుగా మాట్లాడుతుందేమా అని అతని ఆశ్చర్యం.

నిన్నటినుంచీ పరిచయం ఉందేకాని యింత వరకు ఆమెపేరుమాత్రం తెలుసుకోలేకపోయాడు—ఏమన్నా అనుకుంటుందేమోనని. కాని, యిప్పుడామె చూపిన కలుపుగోరుతనంతో కొంచెం ధైర్యం చిక్కింది.

"తమ పేరేంటండీ?"

"నాపేరా....నాపేరు....రమణమ్మ అని తే' సరేగాని, నే నడిగిందానికి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నావే!" అంది.

"దేన్ని గురించండి?"

"అదే, నువ్వు, యింటిదగ్గర రాజాలాగ గడిపే జీవితాన్ని కాల్లదన్నుకొని, మిలిటరీలో ఎందుకు చేరావని."

తన పుట్టుపూర్వోత్తరాలనుగురించి ఎందు కింత పట్టుదలగా అడుగుతుందా అని ఒక్క క్షణంసేపు విచారించాడు. కాని అంత చనువుగా మాట్లాడుతున్న ఆమెతో తన కష్టసుఖాల్ని వెలిబుచ్చుకొంటూ ఒక విధంగా మనస్సంతాపాన్ని తీర్చుకోడం తప్పనిపించలేదు.

"ఏదోలెండి, అంతా అదోమాదిరిగా గడిచిపోయింది."

"ఏది ఏమాదిరిగా గడిచిపోయిందోయ్?" అంది అడ్డుప్రశ్న వేస్తూ.

ఇక తప్పించుకుందుకు మార్గం లేకపోయింది.

"ఇంట్లో కొంచెం తగాదాలు వచ్చినై లెండి" అని, అంతటితో ఆగిపోయాడు.

కాని, ఆమె వదిలిపెడుతుందా?

"ఎవరితో? 'ఆవిడ'తోనా, లేక అమ్మతోనా తగాదా?"

"ఇంకా పెళ్లి కాలేదండి. అయ్యేదేకాని......" చెప్పబోతూండగానే అడ్డువచ్చిం దామె.

"ఇంకా పెళ్లి కాలేదూ!" అని ఆశ్చర్యంగా చూడ్డం మొదలెట్టిందామె, వీరన్నను పైనుంచి క్రిందకు చూస్తూ.

"లేదండీ. కాని......" అతడి చూపులు బరువైన సిగ్గుతో క్రిందకు దిగజారిపోయినై చిరునవ్వుతో.

ఆచూపుల్లోని అంతరార్థాన్ని గ్రహించగలిగిందామె.

"అయితే, పెళ్లి కాకముందే, అమ్మాయిని సంపాదించిపెట్టుకున్నావన్నమాట?" అంది నవ్వుతూ.

"అంతేనండి."

అప్పుడు గ్రహించాడు, ఆవలిస్త్రీ ప్రేగులు లెక్కబెడుతుందని.

"సరే, జరిగిన విశేషమేమిటో సాంతంగా చెప్పూ" అంది.

"చెప్పేదేముంది లెండి. ఆపిల్లా, నేనూ చాణ్ణాళ్లబట్టి పెళ్లిచేసుకుందామనుకున్నాం. కాని వాళ్ల బాబు—తనడిగినంత 'ఓలి' నేనివ్వలేనని తెలుసుకొని—ఆపిల్లను బలవంతాన్న యింకోడికి తీసుకెళ్లి కట్టబెట్టేడు. అక్కడికీ ఒకరోజున ఆపిల్లా, నేనూ దొంగతనంగా ఒకచోట కలుసుకొని, ఆమర్నాడే ఆవూరినుంచి మకాం ఎత్తేద్దామనుకున్నాం. అనుకున్నామే గాని—సాగుబడిలో ఉన్న పొలాన్ని ఎలా వదిలేసి పోవాలో, పోతే యింటిదగ్గర అమ్మా, చిన్నితమ్ముడూ ఏమైపోతారో, ఒకవేళ పోయినా ఆతరువాత ఏం చెయ్యాలో—ఆలోచించుకోనేలేదు.

"ఈసంగతెలా తెలిసిందో దాని మొగుడికి, ఆమర్నాడు పొద్దున్నే దాన్ని జుట్టుపట్టుకు లాక్కొచ్చి నన్నుకూడ బైటికిలాగి, యిద్దర్నీ నిలదీసి అడగడం మొదలెట్టేడు. ప్రాణం నిజంగా చచ్చిపోయిందంటే నమ్మండి! అంతవరకూ ఎలాగో గుట్టుమట్టుగా బ్రతుకుతూవచ్చిన మాఅమ్మకుండే గౌరవంకూడా పోయింది.

ఆమట్టున ఉక్రోషాన్ని వాడూ, నేనూ తన్నుకున్నాంకూడా! అప్పణ్ణుంచీ, నన్ను ఊళ్లోవాళ్లంతా అదో మాదిరిగా చూడ్డం మొదలెట్టేరు. మా కామందుల ఇంట్లోకూడ అందరూ దూరదూరంగా ఉంటూ నన్ను అదోమాదిరి అసయ్యంగా చూడ్డంమొదలెట్టేరు. ఆ తరువాత నాకు ఊళ్లో ఉంటానికే మనసొప్పలేదు. కాని ఇంకో వూరు పోతే, కొత్తగా ఏ కామందు

కొన్నాళ్లైనా పట్టుకోవాలె. అదైనా నమ్మకం లేదు. అందుచేత ఏమీ తోచక, మిలిటరీ జ్ఞాపకంవచ్చి ఆ మూడోరోజురాత్రే, అమ్మతోనైనా చెప్పకుండా బెజవాడ పరుగెత్తుకొచ్చి రిక్రూటయ్యాను. అంతేనండి" అని చెప్పాడు చాలా ముక్తసరిగా.

"అయితే, ఆపిల్లా, నువ్వూ ఎంతకాలం కలిసి ఉంటూండేవాళ్లు, పెళ్లి కాకముందు?" అని చాలా ఆత్రతగా అడిగింది.

అందులోని భావాన్ని అతడు సుతలామూ గ్రహించలేకపోయాడు! కాని జవాబివ్వడం తప్పదు గదా అని—

"చిన్నప్పణ్ణుంచీ ఎరుగుదుం" అన్నాడు.

"ఆహా......అలాగా!" అంది ఆలోచనా పూర్వకంగా అతడి బలిసిన భుజాలమీదికి చూస్తూను.

"వెళ్తానండి. భోజనం టైమయింది."

"పాపం! చాలాసేపణ్ణుంచి నిలుచునే ఉండి పోయావు. మళ్లీ ఆనక వస్తావుకదూ?" అంది జవాబు కోసం ఎదురుచూస్తూ.

"అలాగే లెండి" అని వెళ్లిపొయ్యాడు.

వార్డుమలుపు తిరిగి వెళ్లిపోయేదాకా అతనివేపే చూస్తోంది. వీరన్నంటే అంత ఆత్రత ఎందుకు పుట్టి పోయిందో! ఏమిటో ఆమె ఉద్దేశ్యం!

* * * * *

ఆ గడచిన అయిదురోజుల్లోనూ ఆమెలో ఎంతో మార్పు కనిపిస్తోంది. ఆరోజున వార్డులో నలుగు రైదుగురు పేషెంట్లుమాత్రమే ఉన్నారు. హాస్పిటల్ స్టాఫ్‌వాళ్లుమాత్రం యిద్దరు ముగ్గురు అటూ యిటూ తచ్చాడుతున్నారు.

"మా అమ్మదగ్గరనుంచి ఉత్తరం వచ్చిందండో" అంటూ గదిలోకి ప్రవేశించబొయ్యాడు వీరన్న. కాని రమణమ్మ యింకెవరో వారంటాఫీసరుతో మాట్లాడుతూం డటం చూసి గతుక్కున ద్వారందగ్గరే నిలబడిపోయాడు.

"రా వీరన్నా, లోపలికి రా. స్టాఫ్‌లోనివాడే లే యితను. బెంగాలీ. మన తెలుగు తెలీదులే. కూచో ఆ బల్లమీద" అంది. వెంటనే వారంటాఫీసరువైపు తిరిగి "మా తెలుగువాడే. డ్రైవరు వీరన్న. మంచివాడు." అన్నది యింగ్లీషులో, మూలని కూచున్న వీరన్నవైపు చూసి, చిరునవ్వు నవ్వుతూ.

ఆ బెంగాలీబాబు తిరిగి ఏదో చెప్తూన్న మొదటి మాటలోనే అడ్డంవచ్చి, వీరన్నవైపు తిరిగి అడిగింది: "ఏమిటో అనుకుంటూ వస్తూన్నావేమిటి?"

"మా అమ్మదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులో—" తరువాత చెప్పడానికి సంకోచించాడు.

"ఏమిటే అందులో? 'నీకు పిల్లను చూసి ఉంచాను. వచ్చి పెళ్లిచేసేసుకుని కాపరం వెలగబెట్టు' అని రాసిఉందా?" అన్నది పరిహాసం చేస్తూ.

"కాదు, ఈ నెల యింకో అయిదో పదో ఎక్కువ పంపమంది" తొందరగా చెప్పేశాడు, మూతి ముడుచుకుంటూ.

"అబ్బో, ఈ మాత్రం వేళాకోళానికే అంతగా మూతి ముడుచుకోవాలా!" అన్నది కనుబొమ్మలు పెద్దవిచేస్తూ.

ఆమెమాటల్లోని వ్యంగ్యం ఏమీ అర్థంకాలేదు వీరన్నకు.

వీళ్లిద్దరూ తెలుగుభాషలో అదేపనిగా మాట్లాడు కోడం ఆ బెంగాలీబాబుకు చిరాకు పుట్టించక పోలేదు. కుర్చీలోంచి లేచిపోయాడు ఒళ్లు విరుచు కుంటూ.

"వెళ్తాను సిస్టర్" అన్నాడు యింగ్లీషులో.

"ఓ, అలాగే" అని, తడుంకోకుండా సమాధాన మిచ్చింది. ఆబెంగాలీబాబుని ద్వారంవరకన్నా సాగ నంపడానికి—అసలు కుర్చీలోంచి లేవనేలేదుగదా!

"పోయాడులే! అయితే, వీరన్నా, మీఅమ్మ యింకొంచెం డబ్బు పంపమని రాసిందా? సరేకాని, నీ జీతం ఎంత యిప్పుడు?"

"ఇరవై అయిదూ చిల్లరండి. అందులో అమ్మకు పదిహేను రూపాయలు 'ఎల్లాటుమెంటు' చేశాను. తక్కింది నా సొంతఖర్చుకు"

"తక్కిన పదిరూపాయలూ నిజంగా నీ సొంత ఖర్చుకు సరిపోతాయా?"

"ఓ! మహారాజులాగ! ఈ ఫీల్డులో ఖర్చేముం దండీ?"

"నేను నమ్మను"

ఏం సమాధానం చెప్పాలో తోచిందిగాదు వీరన్నకు.

"అయితే, వీరన్నా, ఏమీ అనుకోకుండా ఉంటే ఒకమాట చెప్తాను వింటావూ? కోపం రాదుగదా!"

"కోపం ఎందుకూ? చెప్పండి"

"నిజంగా?"

"నిజంగానే"

"అయితే, తప్పకుండా వింటానని ఒట్టువేయ్" అని చెయ్యి చాపింది.

వీరన్న కంతా అయోమయంగా ఉంది. ఏం చెయ్యాలో తోచనేలేదు.

"అయితే అంతేనా" అంది చీదరించుకుంటూ.

"లేదండీ"

"అయితే ఒట్టెయ్యి" అని మళ్లీ చెయ్యి చాపింది.

"మొగాడనికూడా ఆలోచించకుండా ఒట్టు కోసం చెయ్యిచాపుతుందేమిటీ" అనుకున్నాడు. కాని, ఏమిటో అర్థంకాక చేతిలో చేయి వేశాడు.

"సరే చెప్తా విను. ముప్ఫయి రూపాయ లిస్తాను; సగం అమ్మకు పంపించుకొని సగం ఖర్చుకు ఉంచుకో! ఏం?" అంది సొరుగులోని చిన్న పర్సును తీస్తూ.

"ముప్ఫయి రూపాయలయితే తరువాత తీర్చు కోలేనండి."

"ఏమిటీ తీర్చుకోడం? అప్పా సప్పా యివ్వ డం లేదే నేను?"

విస్తుబోయ్యాడు ఏమీ అర్థంకాక.

మూడునోట్లనీ వీరన్న అరచేతిలో పెట్టి చేతిని ముడిచింది.

"సరేనా? యిక వెళ్లు. మరి మాట్లాడకు. మళ్లీ ఆనకొస్తావా లేదా?" అంటూ కుర్చీలోంచి లేచి, ద్వారంవరకూ లాక్కుపోయింది వీరన్నను. నవ్వుతూ. "పదకొండున్నరయింది. భోజనానికి వెళ్తున్నాను. ఆనకొస్తావుగదూ, తప్పకుండా" అంటూ వెళ్లి పోయింది బైటికి.

వీరన్న చేష్టలుదక్కి చూస్తూ, అలానే నిలబడి పోయాడు ఒకనిమిషం సేపు.

ఒక డ్రయివరుతో అంతచనువుగా మాటాడు తున్నందుకు పెద్ద ఆఫీసర్లేమన్నా అనుకుంటారేమో నన్న చింత ఆమెకు ఏకోశానా లేదు.

ఆమెచిత్తప్రవృత్తి రోజురోజుకూ, గడియ గడియకూ విచిత్రంగా పరిణమిస్తోంది.

* * * * *

మరొక నాలుగురోజులు గడిచిపోయాక—

ఆరోజున హెడ్‌క్వార్టర్సునుంచి జాగ్రత్తలో ఉండమని హెచ్చరిక వచ్చింది. ఎవరి ట్రెంచీలని వాళ్లు భద్రంచేసుకొని, ఎప్పుడు 'అలారమ్ సిగ్నల్' వస్తుందా అని భయపడి చూస్తున్నా రందరూను.

సాయంత్రం నాలుగుగంటలకి వీరన్న రొజు కుంటూ వచ్చి—

"రవణమ్మగారూ, తొందరపడాలి, టైం ఏ మాత్రం లేదు. లేవాలి" అంటూ తొందరపెట్టేశాడు.

"ఏమిటీ సంగతి? విమానాలేనా? అయితే నడు. మరి, నీట్రక్కును వదిలిపెట్టివచ్చేశావే!"

"నా ట్రక్కూ, నేనూ బాగానే ఉన్నాంకాని మీరు నడండి, ట్రెంచిలోకి తొందరగా!"

ఇద్దరూ వార్డు దాటిరాకముందే సైరనులు కూత మొదలెట్టాయి.

అదృష్టవశాత్తు ఆరోజున వార్డు అంతటికీ ఒక్కడే పేషెంటు ఉన్నాడు. సైరనుకూత వినిపించ గానే ఆ పేషెంటుకూడ కొంచెం ఓపికపట్టి లేచి షెల్ట రును వెతుక్కుంటూ బయటకుపోయాడు. అందుచేత రవణమ్మకుగాని, లేక ఆ వార్డులోని తక్కినస్టాఫ్ వాళ్లకు గాని పేషెంటుగురించి అంతగా జాగ్రత్త తీసు కోవలసిన అవసరం లేకపోయింది.

వార్డుకు దగ్గరలో పొదచాటున త్రవ్విన చిన్న ట్రెంచిలోకి దిగిం దామె.

"అదుగో, నా ట్రక్కు ఆ చెట్టుక్రిందే ఉంది. గబగబా పోయి, అక్కడున్న ట్రెంచిలో దాక్కుంటాను. వెళ్తున్నా. మీరుమాత్రం జడవకండి" అంటూ ట్రక్కు ఉన్న వేపు పరుగెత్తిపోబోయాడు వీరన్న.

"వీరన్నా, ఎక్కడికెళతావ్? నీ ట్రక్కును చూస్తూ రెండో డ్రయివరున్నాడులే! నాకు భయమేస్తోందబ్బా. నీవు నాకు తోడుండూగాని రా."

ఇంతలోనే ఎక్కడో ఆకాశాన విమానాలు కీటకాల్లాగ—క్రిందనుంచి 'ఢా'మ్మని గన్ పేలినశబ్దం!

రవణమ్మ బేజారైపోయి, పరుగెత్తిపోడానికి సిద్ధంగా ఉన్న వీరన్న చెయ్యిపట్టుకొని ఒక్కపట్టున లాగేసింది ట్రెంచిలోకి.

ఈసారి విమానశబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. దూరాన ఎక్కడో బ్రహ్మాండమైన పిడుగు పడ్డ శబ్దం!

భయంచేనైతేనేమి, మరెందుచేనైతేనేమి ఈ సారి ఆమె వీరన్నను కౌగిలించుకోకుండా ఉండలేకపోయింది.

ఆల్‌క్లియర్ విన్నతరువాత యిద్దరూ లేచారు ట్రెంచిలోంచి ధూళితో నిండిన బట్టలతో.

"గండం ఒకటి గడిచిందోయ్, నిజంగా!" అంది తెల్లటిడ్రస్సుమీది దుమ్మును దులుపుకుంటూ.

"అవునండి, నిజంగానే. మరి నే వెళ్తాను. ట్రక్కు దగ్గరికి వెళ్లి ఏమైందో చూసొస్తాను."

ఇద్దరి మొహాలూ కొత్తగా ఉన్నాయి.

ఆరోజునుంచీ వారిద్దరిలోనూ అదోకరకమైన మార్పు!

ఇప్పుడు వీరన్న ఆమెతో మాట్లాడే ప్రతిమాట చివరా "అండీ" చేర్చటం లేదు!

వారిద్దరూ అంతచనువుగా తిరగడం, అలా మాట్లాడుకోడం హాస్పిటల్ స్టాఫ్‌లోని కొంతమంది గ్రహించి గుసగుసలాడుకోకపోలేదు; ఆమె లెక్క చేయనూలేదుకూడా!

ఒక్క డ్యూటీ టైములో తప్పించి, తక్కిన అస్తమానమూ రవణమ్మతో ఏదో మాట్లాడుతూనే ఉంటాడు వీరన్న.

ఆరోజు—తెల్లారుఝాము నాలుగుగంటలప్పుడే పిడుగులవర్షం ప్రారంభమయింది. క్రిందనుంచి ఫిరంగులూ, పైనుంచి విమానాలూ! చాలా బీభత్సంగా ఉంది. బాగా తెల్లారినతరువాతకాని ఆల్‌క్లియరు రాలేదు.

నీరసంగా లేచింది రవణమ్మ ట్రెంచిలోంచి, మరియిద్దరు నర్సులతోకూడ. ఆమె కారోజున ఏదో చెప్పలేని అదురు, భయం అంకురించాయి. కాలకృత్యాలు తీర్చుకొని వేవేగంగా వచ్చింది హాస్పిటల్‌కి.

అప్పుడప్పుడే దెబ్బలుతగిలినవాళ్లని తీసుకొచ్చి దిగబెట్టిపోతున్నయి అంబులెన్సులు. ఆవార్డు డాక్టరూ, రవణమ్మా యిద్దరూ ఒక్కొక్క పేషెంటుదగ్గరికీ వెళ్లి జాగ్రత్తగా పరీక్షిస్తున్నారు.

"ఆఁ......వీరన్న!" ఇరవైరెండో బెడ్ దగ్గరికి వచ్చేటప్పటికి తుళ్లిపడింది రవణమ్మ. బెడ్‌లో స్పృహతప్పిపడిఉన్న మొహంకేసి చూస్తూ అలా ఎంతసేపు కొయ్యబారిపోయిందో తెలియదు.

అవును, వీరన్నే, అభాగ్యుడు! ఆరాత్రి చాలా పొద్దుపోయాకకాని రాలేకపోయాడు. కాని లైనుల దగ్గరున్న సెంట్రీలు అతన్ని ముందుకు సాగనీలేదు. వెనకాల వస్తూన్న మరిరెండు ట్రక్కులకుగూడ యిదే గతి పట్టింది. అక్కడికీ వీరన్న తన మిలిటరీగుర్తులన్నీ చూపిస్తూ, ఆ సెంట్రీలని చాలా వేడుకున్నాడు. దారి విడిచిపెట్టమని. కాని వాళ్లుమాత్రం 'ససేమిరా' అన్నారు.

"సాయంత్రం ఆరుగంటలలోగా మీమీ కంపెనీలకి వెళ్లిపోవలసిందని హుకుం వచ్చినప్పుడు ఎందుకు వెళ్లిపోయారుకాదు? రోజూ ఉండే రాస్తా ఈ సాయంత్రంతో బందయిపోయింది. ఇంకో కొత్తరాస్తా ఉందికాని, దానిమీది వంతెనలు చాలా అల్పంగా ఉన్నాయి. మూడుటన్నుల ట్రక్కులూ, అయిదు టన్నుల ట్రక్కులూ యింకా ఆ కొత్తరాస్తాని వెళ్లడానికి వీల్లేదు. రేపొద్దున ఆ వంతెనల్ని గట్టిపరిచాక తెరుస్తారు. అందాకా మీమూడు ట్రక్కుల్నీ ఆపొదక్రిందో, లేక చెట్లక్రిందో దాచుకోండి." అన్నారు సెంట్రీలు.

ఇక తప్పనిసరిగా వెనక్కు పోతూ, దగ్గరలోనే ఉన్న పెద్దపెద్ద తుప్పలచాటున ట్రక్కుల్నీ నిలిపి, రైఫుల్నుకూడ అమర్చిపెట్టుకొని, స్టీరింగుల మీద తల మోపుకుంటూ కునుకుతీయడం ప్రారంభించారు.

తెల్లారుఝాము నాలుగుగంటలకి దూరాన ఎక్కడో సైరను కూసిందిగాని, ఆ మగతనిద్రలో స్పష్టంగా వినిపించకపోవడంవల్ల ఆ డ్రయివర్లలో ఒక్కరూకూడ తెలివి తెచ్చుకోలేకపోయారు.

ఫర్లాంగుదూరంలోని 'ఢా'మ్మన్న శబ్దంతో త్రుళ్లిపడ్డారు. కాని కళ్లునులుపుకొని ట్రక్కులోంచి క్రిందకు గెంతి ఏదుబ్బులోనో దాక్కొని, ప్రాణరక్షణ చేసుకుందుకు ప్రయత్నించడానికైనా చాలినంత సమయమేదీ?

ఉత్తరక్షణాన్నే కొన్ని గజాలదూరంలోనే బ్రహ్మాండమైన మరొక శబ్దం! పెద్దఎత్తున లేచిన దుమ్మూ, ధూళీ ఆ మసకచీకటినికూడా పూర్తిగా కమ్మేశాయ్!

ఆల్‌క్లియరు వచ్చేటప్పటికి బాగా తెల్లారిపోయింది. దెబ్బతగిలిన ప్రదేశాలవైపు పరిగెత్తుతూ పోతున్నారు ఆంబులెన్సు సిపాయిలు స్ట్రెచర్లతో. నిర్భాగ్యుల్ని మోసుకుంటూ వస్తూన్నాయి మెల్లిగా ఆంబులెన్సుకార్లు హాస్పిటలు వేపు.

అవును పాపం, వీరన్నకూడ నిర్భాగ్యుడే! వీపుకి ఎడంవైపున గట్టి కవుకుదెబ్బ తిన్నాడు. స్పృహ లేదు. శ్వాసకూడ కష్టంగా వస్తూపోతూంది. కాని, రమణమ్మకు మాత్రం వీరన్న తప్పకుండా బతుకుతాడని ఆశ కలిగింది.

వార్డులోని పేషెంట్లదగ్గరికి టెంపరేచరు తీసుకోటానికీ, బలవంతాన మందులు మింగించడానికీ రమణమ్మ వచ్చేటప్పుడు, వీరన్న బెడ్‌మీద కూచుని చాలాసేపు ఏవో మాటలు చెపుతూండేది. వీరన్నకూడా అప్పుడప్పుడూ చిరునవ్వు నవ్వుతూండేవాడు. కాని గట్టిగా మాట్లాడలేడు, ఆయాసం!

ఒక పేషెంటుబెడ్‌మీద మరొకరు వచ్చి కూర్చోడం హాస్పిటల్‌రూల్సుకు వ్యతిరిక్తమైన పని. అయినా ఆమె అట్టే లెక్క చేసేదేకాదు.

ఆరోజున ఆమె హఠాత్తుగా వచ్చింది, వీరన్న బెడ్‌దగ్గరికి, టైముగాని టైములో. ఆమెకళ్లు కొంచెం ఎఱ్ఱబడున్నాయి. మధ్యమధ్య కన్నీరుకూడ గిఱ్ఱున తిరుగుతూందేమో! అప్పటికి వీరన్న సుషుప్తిలో ఉన్నాడు.

"వీరన్నా" అంది మెల్లిగా, వణుకుతూన్న కంఠంతో.

కళ్లు విప్పాడు, మెల్లిగా నవ్వుతూ.

"వీరన్నా!"—ఈసారి కంఠం రుద్ధమైపోయింది. కన్నీటిబొట్లు నాలుగు జారినై.

అర్థంకాని చూపులతో ఆమెకళ్లల్లోకే దృష్టి నిగిడించాడు వీరన్న. కనుబొమ్మలు ముడుస్తూ.

అరనిమిషంసేపు వీరన్నకళ్లల్లోకే చూస్తూ ఉండిపోయింది.

"వీరన్నా, నాకు ప్రమోషను వచ్చింది. కాని......" రెండోవైపు తల తిప్పేసుకుంది, కన్నీటిబొట్లు తుడుచుకుంటూ.

ఆత్రతగా చూస్తున్నాడు వీరన్న తరువాతి మాటకోసం.

మరొక అరనిమిషంసేపు తీక్షణంగా అతని మొహంలోకి చూసిన తరువాత తల ఒక పెడకు తిప్పుకొని "కాని, నర్సింగ్ కేడెట్‌గా ట్రైనింగుకు ఈ మధ్యాన్నమే పోవలసిందని ఆర్డరువచ్చింది. విధి! ట్రైనింగు అయిన తరువాత మరింకేదేశం వెళ్లవలసి ఉంటుందో ఏమో!"

సగం తెలిచుకొన్న నోరుతో అలానే విస్తుపోయి చూస్తున్నాడు వీరన్న. ఈసారి కొంచెం పెద్ద గొంతుకలో చెప్పింది. "నాతరువాత వచ్చే సిస్టరుతో నిన్ను జాగ్రత్తగా చూస్తూండమని చెప్పానులే! అధైర్యపడకు! ట్రైనింగు సెంటరుకు వెళ్లగానే ఉత్తరం రాస్తాలే. నువ్వుకూడా అప్పుడప్పుడు రాస్తూండు.

"పాపం! డబ్బుగురించి చిక్కుపడతావేమో! ఈ అరవైరూపాయలూ అట్టేపెట్టుకో. జాగ్రత్తగా! ఇక్కడకు రావడం యిదే ఆఖరుసారి. అదృష్టం ఉంటే, మళ్లీ తప్పకుండా కలుసుకోగలం. కాని, రమణమ్మను మాత్రం మరిచిపోకుసుమా!"

రూపాయినోట్లు తలగడక్రింద పెట్టి కన్నీళ్లు తుడుచుకొంటూ సన్నగొంతుకలో వీరన్న చెబుతున్నదేమిటో కొంచెమైనా వినిపించుకోకుండా గిరుక్కున తిరిగి వార్డుమలుపు దాటిపోయింది.

---